క్లుప్తంగా

గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



సీఐకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌లకు వినతిపత్రాలు అందించారు. మాట్లాడుతూ.. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగాధరి సీత, జిల్లా భజరంగ్‌దళ్ గోరక్షా ప్రముఖ్ తెన్నేటి విజయ్‌శంకర్, లింబా నాయక్, చెంచాని శ్రీనివాసరావు, తోట లక్ష్మి, భూక్యా మోహన్, పాదిలి రామకృష్ణ, రామగిరి ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

ఇల్లెందురూరల్: జూలై 2న నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బాలాజీనగర్‌లో శుక్రవారం ఇంటింటికి వెళ్లి ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. ప్రియాంకాగాంధీ ప్రవేశపెట్టిన యూత్ డిక్లరేషన్‌లో భాగంగా రాష్ట్రంలోని యువత మేధోశక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర చరిత్ర, ఆవశ్యకతపై ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జలీల్, పులిసైదులు, దొడ్డ దానియల్, ఎట్టి హరికృష్ణ, జాఫర్, ఈశ్వర్, శ్రీను, బాబురావు, పోశయ్య, రాజయ్య, కాయం రమేష్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ పక్వాడా



స్వచ్ఛ పక్వాడాలో పాల్గొన్న సెక్యూరిటీ సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా ఈనెల 16 నుంచి 30 వరకు తలపెట్టిన స్వచ్ఛ పక్షోత్సవాలలో భాగంగా కొత్తగూడెం కార్పొరేట్ సెక్యూరిటీ విభాగం, ప్రైవేట్ సెక్యూరిటీల ఆధ్వర్యంలో సెక్యూరిటీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం స్వచ్ఛ పక్వాడా నిర్వహించారు. సెక్యూరిటీ జీఎం, చీఫ్ ఆఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ హనుమంతరావు మాట్లాడుతూ.. మనం నివాసం ఉండే పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శశిధర్‌రాజు, వేణుమాధవ్, ఎస్‌ఓటూ జీఎం జాకీర్‌హుస్సేన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు, జమేదార్లు, సింగరేణి, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

జేఏసీ సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జటంగి వెంకన్న

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 24న కొత్తగూడెంలో నిర్వహిస్తున్న సదస్సుకు గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న కోరారు. ఇఫ్టూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రామపంచాయతీ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జేఏసీ సదస్సులో పంచాయతీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డి.ప్రసాద్, తొగర సామేలు, మోహన్‌రావు, తాండ్ర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి గోస తీరేదెప్పుడో?

- చిరుతానిపాడు, పెద్దకలన, రాళ్లచెలక గ్రామాల్లో దాహం.. దాహం
- కాలినడకన కిలోమీటరు దూరం వెళ్లినా చెలిమ నీరే దిక్కు
- పట్టించుకోని అధికారులు



వాగులో చెలిమ వద్ద నీటి కోసం వేచి ఉన్న గిరిజనులు

పాల్వంచరూరల్: అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులు తాగునీటి కోసం గోస పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్తేనే చెలిమ నీళ్లు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామపంచాయతీలోని పెద్ద కలస గ్రామంలో 35 ఆదివాసీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామంలో తాగునీటి కోసం నిత్యం అవస్థలు పడుతున్నారు. గ్రామ సమీపంలో రాళ్లవాగులో చెలిమ తీసుకుని నీటిని తెచ్చుకుంటున్నారు. అదికూడా కలుషితమైన బురదనీటిని తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్న పరిస్థితి. బంజర గ్రామపంచాయతీలోని అటవీప్రాంతంలో నివాసం ఉంటున్న చిరుతానిపాడు గ్రామంలో 30 గిరిజన కుటుంబాలు సుమారు 150 మంది జనాభా ఉన్నారు. గ్రామంలో వేసవి కాలం వచ్చిందంటే చాలు తాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. రేగులగూడెం గ్రామపంచాయతీలోని రాళ్లచెలక గ్రామంలో 200 కుటుంబాలు తాగునీరు లేక అల్లాడిపోతున్నారు. బోరు కూడా లేకపోవడంతో వాగులు, వంకల్లో చెలిమనీటిని తాగుతున్నారు. కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లి కావడి, బిందెల మీద బిందెలు, బుర్రలతో నీటిని తెచ్చుకుంటూ అవసరాలు తీర్చుకుంటున్నారు. చెలిమలో ఊట కూడా సక్రమంగా రాకపోవడంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. పంచాయతీ సర్పంచ్‌ను తాగునీరు అందించాలని కోరితే ట్రాక్టర్‌కు డీజిల్ కొట్టిస్తే తాగునీరు ఇస్తామంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాగునీరు తెచ్చుకుంటున్న ఆదివాసీలు

తాగునీరు అందించాలి



ప్రతి సంవత్సరం వేసవికాలంలో తాగునీరు లేక నిత్యం అవస్థలు పడుతున్నాం. గ్రామంలో కనీసం ఒక్క బోరు కూడా లేదు. తాగునీటి కోసం కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లి నీళ్లు తెచ్చుకుంటూ నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. తాగునీటిని అందించి మమ్మలను ఆదుకోవాలి.

– సోడే జోగయ్య, పెద్దకలన

గ్రామంలో బోరు వేయించాలి



తాగునీరు దొరకకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. కిలోమీటరు దూరం వెళ్లినా మంచినీరు లభించక పనులు మానుకుని తాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం. అధికారులు కరుణించి గ్రామంలో తాగునీటి బోరును ఏర్పాటు చేసి తాగునీటి ఇబ్బందులు తొలగించాలి.

– మడకం సురేష్, చిరుతానిపాడు

అటవీశాఖ అభ్యంతరంతో..



మిషన్ భగీరథ పథకం కింద ఆదివాసీ గ్రామాలకు తాగునీటి పైపులైన్ నిర్మాణం చేయడానికి ప్రభుత్వం 2020–2022లో రూ.80 లక్షలు మంజూరు చేసింది. కానీ అటవీశాఖ అభ్యంతరంతో తాగునీటి పైపులైన్ నిర్మాణం చేయలేక మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వలేకపోతున్నాం. నిధులు వెనక్కు వెళ్లాయి.

– తిరుమలేష్, ఇంట్రావిలేజ్ ఈఈ

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ కౌన్సిలర్లు, నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం పట్టణ ప్రజల తాగునీటి గోసను తీర్చాలని సీపీఐ కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు ఖాళీ బిందెలతో శుక్రవారం కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కార్యాలయం ఎదుట స్నానం చేసి కుండలను పగులగొట్టి నిరసన తెలిపారు. అంతకంటే ముందు తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ మేనేజర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు ఘటనా స్థలానికి చేరుకొని కౌన్సిలర్లకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులకు నాయకుల మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. కౌన్సిలర్లు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల ప్రజలు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారని, ఈ విషయం అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రతి వార్డులో రెండు బోర్లు, మినీ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ ‘గృహలక్ష్మి’ అమలు చేయాలి

సుజాతనగర్: అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు వీర్ల రమేష్ అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్ మెయిన్ రోడ్డు నుంచి తహసీల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.3 లక్షలు సరిపోవన్నారు. మండల వ్యాప్తంగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రతిఒక్కరికీ గృహలక్ష్మి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సునీల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గండమల్ల భాస్కర్ సోలం నాగరత్నమ్మ, శారద, రాములు పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆనందఖనీలోని సింగరేణి పాత టింబర్ యార్డులో మొబైల్ డీజిల్ ట్యాంకర్‌ను టూటౌన్ సీఐ రమేష్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ డిస్ట్రిబ్యూటర్ హుస్సేన్, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ రజాక్, బాలకృష్ణ, సంపత్, జల్లి శ్రీనివాస్, రవికుమార్, రమణ, ఆనంద్, బండిరాజ్ గౌడ్, మునేష్, తొగరు రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇల్లెందు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని గుడిసెవాసులకు వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్ ఎదుట సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య నగర్ గుడిసువాసులు ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ లావణ్యకు వినతిపత్రం అందజేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి




పాల్వంచరూరల్: సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

పాల్వంచ/పాల్వంచరూరల్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు తక్షణం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేని పక్షంలో ఆక్రమిస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి దొడ్డా రవికుమార్ అన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో పేదలతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ వినయశీలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఇళ్ల స్థలాల ఎజెండా తెరమీదకు తీసుకొస్తున్నారని, గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో ఎక్కడా స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.సత్య, వి.సత్యవాణి, నిరంజన్, ఎస్‌కె.రహీం, గుర్రాం రాములు, నారాయణ, సులోచన, గౌసియా, మాధవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు దక్కే వరకు తమ పోరాటాలు కొనసాగిస్తామని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య అన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కొత్తగూడెం తహసీల్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. కాసాని మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల కోసం ప్రజలు తహసీల్, కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం ఉండటం లేదన్నారు. అనంతరం తహసీల్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలంగి హరికృష్ణ, లిక్కి బాలరాజు, బి.వీరభద్రం, డి.వీరన్న, భూక్యా రమేష్, ఎస్.లక్ష్మి, ఆవుల శ్రీరాములు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆనందరావు

టేకులపల్లి: ఈనెల 27న పాల్వంచ మండల కేంద్రంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ భవన్‌లో మహాజన సోషలిస్ట్ పార్టీ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జిల్లా మహాసభ జరగనుంది. ఈ సభను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం పలు గ్రామాల్లో ప్రచార సభలు నిర్వహించారు. మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ పట్ల చిత్తశుద్ధితో లేని కారణంగానే మూడు దశాబ్దాలుగా పోరాటాల నిర్వహిస్తున్నా అతీగతి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కానీ, ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు.

స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ



బ్యాగ్‌లు అందజేస్తున్న ఎంఈఓ వెంకట్

జూలూరుపాడు: మండలంలోని వెనకతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ శుక్రవారం స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. లైఫ్ స్పోర్ట్స్ వారి సౌజన్యంతో దాత అబ్దుల్ రజాక్ అందజేసిన ఈ బ్యాగ్‌లు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో వెనకతండా పాఠశాల హెచ్‌ఎం నరసింహా, ఉపాధ్యాయుడు బాలకృష్ణ, ఐఈడీ టీచర్ సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

జూలూరుపాడు: మండల కేంద్రంలో దుకాణాన్ని ప్రారంభించి అక్రమంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్న ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈఓ జి.వెంకట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌తోపాటు, యూనిఫాం, టై, బెల్ట్స్‌ను అమ్ముతున్నారని ఆరోపించారు. అభిమిత్ర, జెమ్మి యశ్వంత్ పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

పాల్వంచరూరల్: సూరారం గ్రామంలో శుక్రవారం డాక్టర్ జీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. వైద్యులు వాణి, షాలిమ్, వైష్ణవి, రామ్ ప్రణయ్ 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ భూక్యా రవీందర్, ఆశా కార్యకర్త నీల, స్థానికులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులు షురూ..



పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

టేకులపల్లి: ఎట్టకేలకు రుతుపవనాలు ప్రవేశించడంతో రైతుల్లో హర్షం ఆనందం వెల్లివిరుస్తోంది. ఎప్పుడెప్పుడా అని తొలకరి జల్లు కోసం ఎదురు చూసిన రైతన్నలకు శుక్రవారం వాన జల్లులు మురిపించాయి. టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా ప్రారంభం అయ్యాయి. దుక్కి దున్నిన రైతులు పత్తి విత్తనాలు విత్తే పనిలో బిజీ అయ్యారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా దుక్కులు, విత్తనాలు నాటే దృశ్యాలే కనిపిస్తున్నాయి. గతేడాది మండలంలో 30,179 ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఈ ఏడాది 32,400 ఎకరాల్లో పత్తి సాగు చేయనున్నారు. వరి 5,480, మొక్కజొన్న 8,500, నువ్వులు 60, పెసర 60, కంది 3,680, మిర్చి 785 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచరూరల్: క్రీడాకారులు ఒలింపిక్‌లో ప్రతిభ చూపి జిల్లాకు అంతర్జాతీయ స్థాయి కీర్తిప్రతిష్టలు తీసుకరావాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శుక్రవారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2కే ఒలింపిక్ రన్‌ను ఎమ్మెల్యే వనమా ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కొంతదూరం పరుగెత్తారు. ఒలింపిక్ జ్యోతిని అంతర్జాతీయ తైక్వాండో క్రీడాకారిణి సింధు తపస్వికి అందజేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. ఒలింపిక్ క్రీడల్లో పతకాలు తెచ్చే సత్తాకలిగిన క్రీడాకారులు జిల్లాలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సీఐ వినయ్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ ప్రవీణ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.మహిందర్, కోశాధికారి రాసపల్లి రాజేంద్రప్రసాద్, సర్పంచ్ విజయ్‌కుమార్, జిల్లా యోగా కార్యదర్శి గుమలాపురం సత్యనారాయణ, జిల్లా అథ్లెటిక్స్ కోచ్ పి.నాగేందర్, పీడీ కృష్ణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



నాయకులగూడెంలో పర్యటిస్తున్న కనకయ్య

ఇల్లెందురూరల్: కొమ్ముగూడెం గ్రామపంచాయతీ నాయకులగూడెం గ్రామంలో జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తులతో కలిసి గ్రామం మొత్తం కలియతిరిగి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో మరో సీసీ రోడ్డును జిల్లా పరిషత్ నిధుల నుంచి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని హెచ్‌ఎం గుమ్మడి కవిత, ఎస్‌ఎంసీ చైర్మన్ శివకృష్ణ జెడ్పీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్నపాక రామయ్య, ఉపసర్పంచ్ తాటి రాంబాబు, ఎంపీటీసీలు తాటి యశోద, పూనెం సురేందర్ స్థానికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం



హాజరైన అంగన్‌వాడీ టీచర్లు

జూలూరుపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలాజ్యోతి అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. గుడ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకు గాను గుడ్లు పక్కదారి పట్టకుండా, పంపిణీలో అక్రమాలు చోటు చేసుకోకుండా గుడ్లపై ప్రభుత్వం ముద్ర వేస్తోందన్నారు. బ్లూ, గ్రీన్, రెడ్ రంగుల్లో మూడు విడతల్లో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని సూచించారు. బడి బాట కార్యక్రమంలో రెండున్నరేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఐదేళ్లు నిండిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, నాగమణి, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చేతివృత్తులపై శిక్షణ



శిక్షణ వివరాలు తెలుసుకుంటున్న సంజీవ్‌నాయక్

ఇల్లెందు: చేతి వృత్తుల ద్వారా ఆదాయం పొందే మహిళలకు ఆయా రంగాల్లో స్థిరపడాలనుకున్న వారికి ప్రత్యేకంగా మెళకువలు అవసరం అని సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులో సేవలాల్ సేన– వెంకటాద్రి ఎస్‌వీఎస్ ఆధ్వర్యంలో సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో చేతి వృత్తుల మహిళలకు ఒక్కరోజు శిక్షణ ఇప్పించారు.

సంజీవనాయక్‌పై కేసు నమోదు..

కొత్త బస్టాండ్ సెంటర్‌లో సంజీవనాయక్ జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు సంజీవనాయక్‌తో పాటు మరో నలుగురు మీద కేసు నమోదు చేశారు. సంజీవనాయక్ మాట్లాడుతూ.. పోలీసులు అకారణంగా తమ మీద కేసు నమోదు చేశారని, జన్మదినం రోజున తమ సంఘం కార్యకర్తలు అభిమానంతో ఆహ్వానిస్తే వచ్చిన సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారని, ఎవరికి ఎలాంటి ఇబ్బంది జరగకపోయినా కేసు నమోదు చేసినట్లు ఆరోపించారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు అందజేస్తున్న డీఈఓ సోమశేఖర శర్మ

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ అన్నారు. శుక్రవారం జూలూరుపాడు హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి డీఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 40 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ట్యాబుల్లో చైల్డ్ ఇన్ఫో, మధ్యాహ్న భోజన పథకం, ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం, పాఠశాలలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హైస్కూల్స్, గిరిజన ప్రాథమిక పాఠశాలలు, కేజీబీవీలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలతోపాటు, విద్యార్థుల సంఖ్య 10 కంటే తక్కువగా ఉన్న పాఠశాలలకు కూడా ట్యాబ్‌లు ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. మన ఊరు– మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని, కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం పాఠశాలల్లో విద్య బోధించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ట్యాబులను ఏ విధంగా ఆపరేట్ చేయాలో జిల్లా విద్యాశాఖ టెక్నికల్ అసిస్టెంట్స్ మోహన్, సతీష్‌లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎంఈఓ గుగులోత్ వెంకట్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల కోసం తపించిన యోధుడు ఎల్లన్న



మాట్లాడుతున్న ఆవునూరి మధు

ఇల్లెందురూరల్: భూమి, భుక్తి, విముక్తి కోసం మితవాద, అతివాద పంథాను తీవ్రంగా వ్యతిరేకించి ప్రతిఘటన పోరాట పంథాలో కొనసాగుతూ ప్రాణాలు అర్పించిన విప్లవకారుడు ఎల్లన్న అని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఆవునూరి మధు అన్నారు. ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎల్లన్న 27వ వర్ధంతి సభ జరిగింది. మధు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో పనిచేసి పార్టీ విస్తరణకు విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. ఈ క్రమంలో వేలాది ఎకరాల పోడు నరికించి భూములను పేదలకు పంచిపెట్టిన ముఖ్యులలో ఎల్లన్న ఒకరని కొనియాడారు. తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, యాకన్న, గౌని నాగేశ్వరరావు, సురేందర్, డి.ప్రసాద్, ప్రకాష్, తోడేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రజాపంథా ఉద్యమ నాయకుడు ఎల్లన్న ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా పిలుపునిచ్చారు. శుక్రవారం జూలూరుపాడులో ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో ఎల్లన్న వర్ధంతి నిర్వహించారు. ఎల్లన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ధర్మా మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి ఎల్లన్న ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వై.గోపాల్‌రావు, రాయల సిద్ధు, మంద్రాజుల కృష్ణయ్య, కంగాల వెంకటమ్మ, మధు పాల్గొన్నారు.

సుజాతనగర్: కామ్రేడ్ ఎల్లన్న ఆశయసాధన కోసం కృషి చేయాలని సీపీఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాలోత్ కృష్ణ అన్నారు. పాత అంజనాపురం గ్రామంలో ఎల్లన్న వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బానోత్ ధర్మా, మంద్రాజుల కృష్ణ,దుర్గ, సులోచన, కుమారి, వెంకటమ్మ పాల్గొన్నారు.